క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప మెడికేర్ హాస్పిటల్‌లో డాక్టర్ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ వైద్య శిబిరంలో షుగర్, కొలెస్ట్రాల్, నరాల పటుత్వ పరీక్షలను నిర్వహించారు. వీటితోపాటు రూ.2 వేల విలువ చేసే లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షను కూడా ఉచితంగా చేశారు. అనంతరం అందరికీ ఉచితంగా మందులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. నేడు చాలా మందికి లివర్‌కు సంబంధించిన ఫాటీ లివర్ సమస్య ఎక్కువగా వస్తుందన్నారు. ఫాటీ లివర్ రాకుండా ఉండాలంటే మంచి ఆహారం తీసుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. దీంతోపాటు షుగర్‌కు తగిన జాగ్రత్తలు తీసుకుని డైట్ ఫాలో అవ్వాలని, క్రమ తప్పకుండా వైద్యుల సలహాతో మందును వాడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది ఆయేషా, గౌతమి, శిరీషరెడ్డి, భార్గవి, వైష్ణవి, సబిహా, మాదవి, మహిత, షాహిద్ పఠాన్‌తోపాటు మెడికల్ రెప్స్ పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు



గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులు, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. జంతుబలి ఇచ్చిన అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ ఆలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు. బలిజపల్లె గ్రామస్తులు అంకాలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకొని బోనాలు సమర్పించుకున్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం: జహవర్ నవోదయా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బేబి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షకు ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్నారు. వివరాలకు నవోదయ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు.

ప్రజలకు నాణ్యమైన మాంసం విక్రయించాలి

పులివెందుల టౌన్: ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలు మాంసం దుకాణ యజమానులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని పలు మాంసం, చేపల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం విక్రయదారులు ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడరాదన్నారు. విరుద్ధంగా వ్యవహరిస్తే షాపు లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

పని చేయని ఏటీఎంలు

పులివెందుల రూరల్: పట్టణంలోని కెనరా, ఏపీజీబీ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పార్నపల్లె బస్టాండు సమీపంలోని కెనరా బ్యాంకు ఆవరణంలోని ఏటీఎం, లక్ష్మీ హాల్ సమీపంలోని ఏపీజీబీ ఏటీఎంలు పనిచేయడం లేదు. బ్యాంకు అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలు పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

అధిక ధరకు విక్రయిస్తున్నా పట్టించుకోరేం?

ప్రొద్దుటూరు : యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ 47 కేజీల యూరియా బస్తా రూ.360కు అమ్మాల్సి ఉండగా రూ.470కిపైగా అమ్ముతున్నారన్నారు. యూరియా కొరత ఉందని, ఎక్కువ ధరకు ఫర్టిలైజర్స్ షాపుల వారు అమ్ముతున్నారని చెప్పారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ఫర్టిలైజర్ షాపుల వారు మాత్రం రూ.కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు, విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఎకరాకు మూడు బస్తాలు అవసరమవుతాయని, కానీ ప్రభుత్వం ఒక బస్తా మాత్రమే ఇస్తోందన్నారు. ప్రభుత్వమే మూడు బస్తాల యూరియా అందించాలని కోరారు.

తెలుగు భాషా పరిరక్షణకు ప్రణాళికలు అవసరం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

కడప ఎడ్యుకేషన్ : తెలుగు భాషా పరిరక్షణకు వినూత్న ప్రణాళికలు అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం తెలుగు భాషా పరిరక్షణ – కార్యాచరణపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ ఇంటి నుంచే ఆరంభించాలని, పిల్లలను ఆ దిశగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, రచయితలు, మేధావులు కలసి చర్చాగోష్ఠులు నిర్వహించి భాషా పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యోగి వేమన విశ్వవిద్యాలయ కులసచివులు (ఇన్‌చార్జ్) ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తెలుగు భాషా అభ్యున్నతికి కేంద్రంగా ఉంటూ అనేక సాహిత్య కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు తెలుగుకు సంబంధించిన పలు రకాల పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రధాన వక్త, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో భాషా పరిరక్షణ సమితి ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను అధికార భాషా సంఘం చేపట్టాలన్నారు. ఆత్మీయ అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, వైఎస్సార్ కడప జిల్లా బీజేపీ అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి, బీజేవైఎం జాతీయ కార్యదర్శి పనతల సురేష్ తదితరులు పాల్గొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి సభా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను సన్మానిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులు

గానుగపెంట హనుమంతరావుకు సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ సాహితీవేత్త , భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావును భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఘనంగా సత్కరించారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగిన తెలుగుభాషాపరిరక్షణ కార్యాచరణ సదస్సులో ఈ సత్కారం జరిగింది.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్ : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యుడు వెంకట్రామిరెడ్డి కోరారు. ఆదివారం కడపకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్‌ను ఆపస్ ఆధ్వర్యంలో కలిసి వినితిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన అర్చకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక సభ్యులు కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అర్చక స్థితిగతులపై విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. విజయవాడలో ఒక సమావేశం ఏర్పాటు చేసి అర్చక సమైక్య సూచనలను అమలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు విజయబట్టర్, అర్చక పురోహిత సభ్యులు ప్రభాకర్ శర్మ, ప్రసాద్ శర్మ, సుధీర్ శర్మ,సాగర్ శర్మ, సురేష్ శర్మ, చరణ్ శర్మ, శ్రీకాంత్ ఇతర పురోహితులు పాల్గొన్నారు.

ఆయుష్ శాఖ ఏర్పాటు చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను ఆయుష్ వైద్యులు కలిసి వినతిపత్రం సమర్పించారు. నేషనల్ ఆయుష్ మిషన్, కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో ఆయుష్ శాఖను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తరుణ్, డాక్టర్ మహేష్, డాక్టర్ చలపతి పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కడపలో ఆగస్టు 30, 31 తేదీలలో జరిగే ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఏళ్లుగా గర్భవతులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు చేర్చటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఉద్యోగానికి భద్రత లేక కనీస వేతనం లేక గుర్తింపు లేక సంవత్సరానికి 365 రోజులూ సెలవులు లేకుండానే పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకోవడం తప్ప వేతనాలు పెంచాలని, ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆలోచన చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పైన మహాసభలలో చర్చించి, తీర్మానాలు చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోబోతున్నట్లు తెలిపారు. కడపలో జరుగుతున్నటువంటి ఆశ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలోని ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి, 30వ తేదీ ప్రదర్శన బహిరంగ సభ, 31వ తేదీన ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా నాయకులు బి.చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి చాముండేశ్వరి, కోశాధికారి వాణి, అధ్యక్షురాలు హేమ, జిల్లా అధ్యక్షరాలు యు.మరియమ్మ, కోశాధికారి అమ్ములు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. శాంతమ్మ, కర్నూలు జిల్లా కార్యదర్శి రమ్మీ జాబి, నంద్యాల జిల్లా కార్యదర్శి వేదవతి, వరలక్ష్మి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.రాకేష్ చంద్ర తెలిపారు. ఆదివారం కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో చర్చి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం, సీసీ కెమెరాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ఇప్పుడు నాటిన మొక్కలు అద్భుత రీతిగా భవిష్యత్ తరాల వారికి ఉపయోగపడతాయని, కృపా కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం పాస్టర్ పి.మహేష్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కృపా కాలనీ, బుడగజంగం కాలనీలలోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కడప జిల్లా ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. నాటిన మొక్కలను పర్యవేక్షించడంలో స్థానికులు ముందుండాలని ఆకాంక్షించారు. ఎస్ఐ తాహిర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రస్తుత ఈ కాలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీసీ కెమెరాలు కూడా దోహదపడతాయని, ఒక్క సీసీ కెమెరా ఉంటే వెయ్యి మంది పోలీసులతో సమానమన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కృపా కాలనీ న్యూ నేటివ్ కృపా చర్చి వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తుందని, ముఖ్యంగా చిన్నారులు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉంటూ విద్య వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దైవజనులు ఆర్.అశోక్ కుమార్, బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డి. శ్రీరాములు, సంఘ పెద్దలు పి.రవితేజ, నరసయ్య, శాంతిరాజు, రోజా, సరళ, సుగుణమ్మ, వెంకటరమణ, అల్లూరమ్మ అనేక మంది భక్తులు పాల్గొని దేశ ఐక్యత క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

భాజపా, జనసేన వారి మత విద్వేష‘ముల్లు’

కడప వైఎస్సార్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూడా మతోన్మాద ప్రాంతంగా మార్చే కుట్రలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అజెండా, భారతీయ జనతా పార్టీ సమ్మిళిత మత ఉన్మాదాన్ని హరిహర వీరమల్లు చిత్ర రూపంలో తీశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజ్యాంగ బాధ్యతలను కూడా ఉల్లంఘిస్తూ సదరు చిత్రాన్ని తెరకెక్కించిన దురుద్దేశం బహిర్గతమైందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మతోన్మాదం, మారణకాండను కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజ్వరిల్లింపజేసేందుకు జరిగిన కుట్రగా దీన్ని అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మత దురహంకార, హేయమైన ప్రచారంలో భాగంగా ఔరంగజేబు, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని మత విద్వేషాన్ని రెచ్చగొట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దీనికి ప్రధాన కారకుడైన పవన్ కల్యాణ్ పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. భారత దేశ చరిత్రను పూర్తిగా వక్రీకరించినందుకు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటుగా చిత్ర నిర్మాత, దర్శకులు జాతీయ నేరానికి పాల్పడ్డారని ఆరోపించారు. సినిమాలో నటించిన పవన్ కల్యాణ్, చిత్ర నిర్మాత, దర్శకులు కథ రచయితలను చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. హరిహర వీరమల్లు 1315లో చనిపోయినట్లు చరిత్ర చెబుతుండగా, 16వ శతాబ్దంలో ఔరంగజేబు జన్మించి తదుపరి పాలన చేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయన్నారు. అయితే ఔరంగజేబును విలన్‌గా చూపిస్తూ ఆర్ఎస్ఎస్, బీజేపీ మత విద్వేష అజెండాను చిత్రంగా రూపొందించిన పవన్ కల్యాణ్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రీయ స్వయం సేవ సంఘ్ ప్రచారక్‌లా పని చేస్తున్న పవన్ కల్యాణ్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ చిత్ర ప్రదర్శన నిలిపివేయాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముస్లింల మనోభావాలను దెబ్బ తీసినందున పవన్ కల్యాణ్ లాంటి బాధ్యత కలిగిన రాజకీయ నాయకుడు ఇలాంటివి పునరావృతం కాకుండా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్పీలకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్ల(ఆర్పీ)లకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని మెప్మా ఆర్పీల యూనియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అరకొర వేతనాలతో కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. మెప్మా ఆర్పీలకు అదనపు బాధ్యతలు భారంగా మారుతున్నాయన్నారు. పట్టణాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ఏర్పాటు, వాటి బలోపేత, రుణాలు ఇప్పించడం, సకాలంలో రుణాలు చెల్లించేలా ప్రయత్నాలు చేయడం, పొదుపు పాటింపజేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, నిర్ణీత గడువుల్లో మహిళా సంఘాల సమావేశాలు, వార్డు సమాఖ్య సమావేశాలు నిర్వహించి పలు తీర్మానాలు చేయించడం వంటివి చేస్తుంటారన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వేలు, ఇతర కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నెలకు రూ.26 వేతనం పెంచి నేరుగా ఆర్పీల ఖాతాల్లో జమ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాడ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా ఆర్పీల యూనియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా

బాలసాహిత్యంలో మేటి కృష్ణస్వామిరాజు

- తిరుపతి విశ్రాంత తెలుగు పండితులు నెమిలేటి కిట్టన్న

కడప ఎడ్యుకేషన్ : విజ్ఞానం, యుక్తిని మేళవించి బాలసాహిత్యాన్ని రచించిన మేటి రచయిత ఆర్.సి. కృష్ణస్వామి రాజు అని తిరుపతికి చెందిన విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం'కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 145వ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచనలు చిత్తూరు జిల్లా మాండలికం, జనం మాట్లాడుకొనే భాషలో ఉంటాయని, అదే విధంగా అక్కడి ప్రాంతాలే ఆయన కథా కేంద్రాలుగా ఉంటాయన్నారు. ఆ తర్వాత 'ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం' అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు నెమిలేటి కిట్టన్న ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో రాయలసీమ కథాసాహిత్యానికి వన్నె తెచ్చిన కథకుల్లో ఆర్.సి.కృష్ణస్వామి రాజు ఒకరని, బాలసాహిత్యకర్తగా కూడా ఆయన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆయనవి చిన్నాపెద్దా కథలు 650 దాకా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయని, వీటిలో 150 పిల్లల కథలు ఉండటం విశేషమన్నారు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు తిరుపతి జిల్లా పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయన మొదట కార్వేటి నగరం డైట్‌లో అధ్యాపక ట్రైనింగ్ పూర్తి చేశారని, ఆ తర్వాత తిరుపతి ఎల్ఐసీ కార్యాలయంలో 35 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారన్నారు. ఆయన ఇప్పటి దాకా భిన్న వర్గాలకు చెందిన 18 కథా సంపుటాలు, 2 నవలలను వెలువరించారన్నారు. బాల సాహిత్య సృష్టిలో భాగంగా ఆయన 'రాజు గారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు' అనే కథా సంపుటాలను, 'మేకల బండ, మునికిష్టడి మాణిక్యం' అనే నవలలను రాశారన్నారు. ఈ రచనల్లో ఆయన వాడిన తెలుగు జాతీయాలు, సామెతలు, నుడికారాలను ఉదాహరణలతో వివరించారు. మానవీయ సంబంధాలు, విలువలు కృష్ణస్వామి రాజు బాలసాహిత్యంలో ఎలా చిత్రింపబడినది విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమం అనంతరం వక్త నెమిలేటి కిట్టన్నను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అహ్మద్ బాషా, పళ్ళె విజయ్, కుమార్, కొత్తపల్లె రామాంజనేయులు, శ్యామసుందర్‌రెడ్డి, రమణమూర్తి, వెంకట రమణ, విజయ కుమార్, సుబ్బరాయుడు, బాలరాజేశ్వరరెడ్డి, నల్లప రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి విశ్రాంత తెలుగు పండితులు నెమిలేటి కిట్టన్నను సన్మానిస్తున్న వైవీయూ సిబ్బంది

శక్తి యాప్ సేవలు వినియోగించుకోండి

కడప అర్బన్ : మహిళలు, బాలికల రక్షణకు, వారికి ఆపద సమయంలో శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి ఆదివారం సాయంత్రం కడప నగర శివార్లలోని శిల్పారామం సందర్శకులకు రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన «శక్తి» యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీ సమస్య, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలు అరికట్టేందుకు డయల్ 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర తదితరాలపై అవగాహన పెంచుకుని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



శిల్పారామంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుభాష్ చంద్రబోస్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో 1990–95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకొని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్ కోరారు. ఆదివారం కడప పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను వారు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా యూపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. దేశం మొత్తం మీద అందరూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాలకు మురళి, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : సంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలని బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్, నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, యువ సంఘాలు, ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విరజానందస్వామి మాట్లాడుతూ హైందవుల పండుగలలో వినాయక చవితి ప్రముఖమైనదని, ఈ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలన్నారు. హిందూ ధర్మం, సంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులందరూ నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనాలని తెలిపారు. హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులకు ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, సందు శివనారాయణ, వ్యాపార వేత్త దండపాణి, నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు సి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి రెడ్డి కుమార్, ట్రెజరర్ నాగమునిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చౌడయ్య, సురేంద్ర, వెంకటసుబ్బారెడ్డి, రమేష్, కొండయ్య పాల్గొన్నారు.

ఘనంగా నాగుల ప్రతిష్ట

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని దళితవాడలో ఆదివారం వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నాగుల ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన నాగులను పునఃనిర్మించారు. ఈ క్రమంలో ఆదివారం నాగుల పునఃప్రతిష్ట హోమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని నాగుల పునఃప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 18, 20 స్త్రీ, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలలో క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా తెలిపారు. వీరు ఆగస్టు 09, 10, 11వ తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, శంకర్, బి.బాషా, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, కోచ్ వివేకానందరెడ్డి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని, భార్గవ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కాంట్రాక్టు అధ్యాపకులను కూటమి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేసే వరకు వారికి అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సమావేశంలో ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధన్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోలు నాగేంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిలానీ, మహబూబ్‌బాషా, రామకృష్ణ, రామ మోహన్, చిన్నయ్య, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.